

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 22 డిసెంబరు 2024

జిల్లాపై కరుణ చూపండి


గండికోట

- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి
- చివరి ఆయకట్టు వరకు నీరందాలి
- గండికోట, సిద్దవటం కోటను పర్యాటక హబ్‌గా మార్చాలి
- నేడు జిల్లాకు మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్ రాక

జిల్లాలో బంగారం పండే భూములున్నా సాగునీరు లేదు. ప్రాజెక్టులు ఉన్నప్పటికి కాల్వల ద్వారా చివరి ఆయకట్టుకు నీరందని దుస్థితి నెలకొంది. ఇప్పుడు వాటిని పూర్తిచేసే బాధ్యత కూటమి ప్రభుత్వంపైనే ఉంది. ఆదివారం కడపలో జరిగే ఓ కార్యక్రమానికి నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్ రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై వీరు దృష్టి సారించాల్సి ఉంది. వచ్చే ఏడాదిలో ప్రాజెక్టులకు నిధులు కేటాయించి జగన్ తన సొంత జిల్లాకు ఐదేళ్లలో చేయలేని ప్రాజెక్టుల పనులను పూర్తిచేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకునే అవకాశం కూటమి ప్రభుత్వానికి ఉంది.

(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడపలో సాగునీటి ప్రాజెక్టులకు టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ హయాంలోనే బీజం పడింది. తెలుగుగంగ మొదలుకుని ప్రధాన ప్రాజెక్టులన్నీ టీడీపీ హయాంలోనే పురుడుపోసుకున్నాయి. అయితే నేటికీ ఆ ప్రాజెక్టులు పూర్తి కాలేదు. దీర్ఘకాలిక నిర్మాణాల వల్ల అంచనాల వ్యయం పెరుగుతోంది. గత టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టులపై కొంతమేర కృషి చేశాయి. నిన్నటి జగన్ ప్రభుత్వం మాత్రం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా అటకెక్కించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి జిల్లా వాసులు బ్రహ్మరథం పట్టారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, మౌలిక వసతుల కోసం కూటమి ప్రభుత్వంపైనే జనం ఆశలు పెట్టుకున్నారు. 2014-19 అప్పటి టీడీపీ ప్రభుత్వంలోనే పులివెందులకు కృష్ణా జలాలు తీసుకొచ్చారు. ఏటా రైతులు చీనీచెట్లను కాపాడుకునేందుకు పులివెందుల రైతులు భగీరథ ప్రయత్నం చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పులివెందులలో ఎటుచూసినా కృష్ణాజలాలే కనిపిస్తుంటాయి. అయితే చివరి ఆయకట్టుకు నీరందేలా కాలువలు పూర్తిచేయాల్సి ఉంది.

జిల్లాలో ప్రాజెక్టుల పరిస్థితి..

- గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు ఇంకా పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. దీంతో గండికోట ప్రాజెక్టు కాల్వల పనులు ఇంకా పూర్తికాలేదు. ఎగువన కురిసే వర్షాలతో గండికోట ప్రాజెక్టు నిండినా దిగువన ప్రాజెక్టులకు నీరు చేరే అవకాశం లేదు.
- బ్రహ్మంసాగర్ ద్వారా 1.77లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికి పనులు పూర్తికాలేదు. డిస్ట్రిబ్యూటరీలు లేకపోవడంతో చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందలేదు. చెరువులు, డ్యాంలకు ఎత్తిపోతల ద్వారా నీరిస్తున్నారు. 1.25లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. జీఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు పూర్తయితే కడప జిల్లాలో పూర్తిస్థాయిలో సాగుభూములకు నీరందుతుంది. అయితే అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో పనులు ముందుకు పోవడం లేదు.
- ఇక సర్వరాయసాగర్ ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నిధుల అవసరం ఉంది. వామికొండ రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీలు పూర్తికాలేదు. మైడిపాశెం పరిధిలో 74వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక్కడ డిస్ట్రిబ్యూటరీలు లేవు. ఇక సీబీఆర్ పరిధిలో డిస్ట్రిబ్యూటరీలు లేవు. పీబీసీ పరిధిలో 18 ఎత్తిపోతల పథకాల పనులు సాగుతూనే ఉన్నాయి. సుమారు 60వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉండగా కేవలం 20వేల ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. ఇక మైలవరం దక్షిణకాల్వ ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. ఇక వామికొండ, సర్వరాయసాగర్ పరిధిలోని 24వేల ఎకరాల ఆయకట్టుకు పూర్తిగా నీరందలేదు.

పర్యాటక హబ్‌గా

జిల్లాను పర్యాటక హబ్‌గా మార్చేందుకు అద్భుతమైన ప్రాంతాలు ఉన్నాయి. గండికోట, సిద్దవటం కోటలను పర్యాటక ప్రాంతాలుగా తయారు చేయవచ్చు.

- గండికోటలో సహజసిద్ధమైన పెన్నాలోయ ఉంది. దీనిని గ్రాండ్ క్యానన్ ఆఫ్ ఇండియాగా పిలుస్తున్నారు. గండికోట కేంద్రంగా సినిమా షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. తమిళ అగ్రనటులైన సూపర్‌స్టార్ రజనీకాంత్, కమల్‌హాసన్, విక్రమ్, విజయ్, లారెన్స్‌తో పాటు ఇతర తమిళ సినిమాలను గండికోట, ఎర్రగుంట్ల, కడప తెలుగుగంగ కార్యాలయాల పరిధిలో చిత్రీకరించారు. ఇక్కడ సహజసిద్ధమైన సుందర ప్రదేశాలు ఉన్నాయి. తెలుగు సినిమాలు కూడా గండికోటలో షూటింగ్ చేస్తుంటారు. గండికోట సినిమాల షూటింగ్‌ల విషయంలో బాగా ప్రాచుర్యం పొందింది. దీంతో కర్ణాటక, తమిళనాడు ఇండస్ట్రీ తాకిడి ఎక్కువ అవుతోంది. వీకెండ్‌లో బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే వారితో కిటకిటలాడుతుంటుంది. అయితే అక్కడ పర్యాటకులకు అవసరమైన సదుపాయాలు లేవు. అన్ని వసతులు కల్పిస్తే రాష్ట్రంలోనే నెంబర్ 1 పర్యాటక ప్రాంతంగా మారుతుంది.
- ఇక సిద్దవటం కోటకు ఎంతో చరిత్ర ఉంది. చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి కోట చుట్టూ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేశారు. లైటింగ్ సమయంలో కోట గురించి వచ్చే వ్యాఖ్యానం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. సిద్దవటం కోటను కూడా చంద్రగిరి కోటలా చేస్తే ఇదొక మంచి టూరిస్ట్ ప్లేసుగా మారుతుంది. కడప నుంచి సిద్దవటం కోట 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. పక్కనే పెన్నానది ఉండడంతో సౌండ్ లైటింగ్ ఏర్పాటుచేస్తే సాయంత్రం మరింత ఆకర్షణగా తయారవుతుంది. ఆటవిడుపు కోసం కడపే కాదు అటు రాజంపేట, తిరుపతికి వెళ్లే టూరిస్టులు సిద్దవటం కోటకు వచ్చి కోట అందాలను చూసి రిలాక్స్ కావచ్చు. దీనిపై మంత్రి దుర్గేశ్ ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.
- కడపలో హరిత హోటల్ ఉంది. విశాలమైన స్థలంలో నిర్మించారు. అయితే పై అంతస్తులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. దీనికి ఇంకా ఓపెన్ ప్లేస్ కావాల్సి ఉంది. ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటుచేస్తే ఫంక్షన్లు చేసుకునే అవకాశం ఉంటుంది. దీని వల్ల పర్యాటక శాఖకు ఆదాయం వస్తుంది.
- ఇక తెలుగు భాష కోసం ఎనలేని కృషిచేసిన సీపీ బ్రౌన్ పేరిట కడపలో గ్రంథాలయం ఉంది. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కూడా గ్రంథాలయాల గురించి గొప్పగా చెబుతుంటారు. దీనిని పర్యాటక ప్రాంతాల జాబితాలో చేరిస్తే తెలుగు భాషకోసం కృషి చేసిన సీపీ బ్రౌన్‌కు గొప్ప గుర్తింపు ఇచ్చినట్లవుతుంది. వీటితో పాటు జిల్లాలో మరెన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వీటన్నిటిని అభివృద్ధి చేసి ప్రచారం కల్పిస్తే కడప పర్యాటక హబ్‌గా మారుతుంది.

సర్వరాయసాగర్


లక్ష్య సాధనతో
విజయం సొంతం

- నిరాశకు లోను కాకూడదు
- ఆంధ్రజ్యోతితో కడప కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి



(కడప- ఆంధ్రజ్యోతి): "సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేటప్పుడు రోజుకు 8గంటలు నుంచి 10గంటలు చదివేవాన్ని. ప్రణాళికాబద్ధంగా సాధన చేయాలి. ఒకవేళ అను కున్న లక్ష్యం నెరవేరకపోయినా నిరాశ చెందకుండా ముందుకు సాగాలి" అని డిప్యూటీ కలెక్టర్, కడప కార్పొ రేషన్ కమిషనర్‌గా పని చేస్తున్న ఎన్.మనోజ్‌రెడ్డి వెల్లడించారు. ఐఏ ఎస్ కావాలన్న లక్ష్యంతో సివిల్స్‌కు ప్రిపేర్ అయి ఆరుసార్లు ప్రయ త్నించానని, రెండుసార్లు ఇంటర్వ్యూ వరకు వచ్చి ఆగిపోయింద న్నారు. అయినా కుంగిపోలేద న్నారు.. పోటీ పరీక్షల్లో పోటీపడేవారు కూడా అదే స్థాయిలో ఉంటారని నిరుత్సాహానికి ఎప్పుడూ గురి కావద్దన్నారు. తాను ఉద్యోగం ఎలా సాధించాను, దానికోసం ఎలా కష్టపడ్డాను, కుటుంబం గురించి ఆంధ్రజ్యోతికి వివరించారు.

కుటుంబ నేపథ్యం

ఎన్.మనోజ్‌రెడ్డిది ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటి మండలం ఎండ్లపల్లె గ్రామం. తల్లిదండ్రులు ఇద్దరూ విద్యావంతులే. తల్లి కళావతి స్కూలు అసిస్టెంటు. తండ్రి సహదేవరెడ్డి జూనియర్ కాలేజీ లెక్చరర్. భార్య తేజస్విని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఆలిండియా మూడో ర్యాంకు. టెలికాం డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. తమ్ముడు ప్రదీప్‌రెడ్డి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. ఇన్‌కంట్యాక్స్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు.

విద్యాభ్యాసం

1 నుంచి 10వ తరగతి వరకు రాయచోటిలో, ఇంటర్మీడియట్ హైదరాబాదులో చదువుకున్నారు. అనంతరం ఐఐటీ బాంబేలో చదివారు. ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో 2016 నుంచి 2022 వరకు ఢిల్లీలో శిక్షణ తీసుకున్నారు. పొలిటికల్ సైన్స్ ఆప్షనల్‌గా ఎంచుకున్నారు. ఆరుసార్లు ఐఏఎస్‌కు అటెంప్ట్ చేయగా రెండుసార్లు ఇంటర్వ్యూ వరకు వచ్చి మిస్సయింది.

ఉద్యోగ బాధ్యతలు


ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో మెరుగైన ర్యాంకు రావడంతో ఎన్.మనోజ్‌రెడ్డి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. 2022 ఆగస్టు 23 వరకు కర్నూలులో శిక్షణ. తొలి పోస్టింగ్ 2023లో. ఎన్నికలకు సంబంధించి పలమనేరు ఆర్వోగా పనిచేశారు. ఇక కడప కార్పొరేషన్ కమిషనర్‌గా ఈ ఏడాది అక్టోబరు 17 నుంచి పనిచేస్తున్నారు.

మానసికంగా కుంగిపోలేదు

"ఆరు సార్లు ఐఏఎస్‌కు అటెంప్ట్ చేశా. రెండుసార్లు ఇంటర్వ్యూ వరకు వచ్చి నిలిచా. వత్తిడి ఉంటుంది. అయినా మానసికంగా కుంగిపోలేదు. బాగా కష్టపడ్డాను. అయితే మనతో పాటు పోటీ పడేవారు ఎక్కువగా ఉంటారు. కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ బాగా సపోర్టు చేశారు. దీంతో డిసప్పాయింట్ కాలేదు" అన్నారు.

ఐఏఎస్‌కు ప్రిపేర్ అయ్యేవారికి సూచన

"అనుకున్న లక్ష్యంకోసం ప్రణాళికాబద్ధంగా చదవండి. పోస్టులు తక్కువగా ఉంటాయి. ఎక్కువ పోటీ ఉంటుంది. ఉద్యోగం రాలేదని మానసికంగా కుంగిపోవద్దు. టెన్షన్ పడవద్దు. ఇంకో జాబ్ వస్తుంది. ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలల్లో ఐఐటీ, ఐఏఎస్ కోచింగ్ ఇస్తున్నారు. తరగతికి సంబంధించిన పాఠాలు పక్కనబెట్టి ఈ కోర్సులపై యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. ఐఏఎస్ పరీక్షల్లో కూడా కళాశాల విద్య పాఠ్యాంశాలపై ప్రశ్నలుంటాయి. కాబట్టి కళాశాలలో విద్యాభ్యాసం చేసేటప్పుడే తరగతి పాఠాలపై దృష్టి సారించాలి. ఇది ఐఏఎస్ పరీక్షలకు కొంత ఉపయోగపడుతుంది" అని ఎన్.మనోజ్‌రెడ్డి సూచించారు.

కుటుంబ సభ్యులతో..


ఎంపీ పీఏ రాఘవరెడ్డి.. మరోసారి విచారణకు

పులివెందుల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిని పోలీసులు మరోసారి విచారించారు. వర్రా రవీందర్‌రెడ్డి సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి ఇప్పటికే రాఘవరెడ్డిని ఐదు రోజుల పాటు విచారించారు. కొద్దిరోజుల విరామం తర్వాత తిరిగి శనివారం పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు విచారణకు రావాలని ఆయనకు సీఐ నరసింహులు ఆదేశాల మేరకు పోలీసులు సమాచారం అందజేశారు. దీంతో శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రాఘవరెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. కానీ అక్కడ పోలీసులు విచారించలేదు. తిరిగి సాయంత్రం రావాలని చెప్పడంతో వెళ్లిపోయి మళ్లీ 5గంటలకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. విచారణ అనంతరం ఆయనను పంపించేశారు.

దేహదారుఢ్య పరీక్షలకు ఏర్పాట్లు

కడప క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల కోసం చేపట్టిన ఏర్పాట్లను శనివారం అన్నమయ్య, కడప జిల్లాల ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పరిశీలించారు. దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ) మైదానాన్ని ఎస్పీ పరిశీలించి చేపట్టవలసిన పనులపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలక్ట్రిసిటీ, ఇంటర్నెట్, ఆహారం, నీటి సౌకర్యం, టాయిలెట్‌లు, వైద్యం తదితర వసతులు సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు. ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన ఉమ్మడి కడప జిల్లాలోని పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వతేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ ఏఆర్ బి.రమణయ్య, డీటీసీ ఇన్‌స్పెక్టర్ వినయకుమార్‌రెడ్డి, రిమ్స్ పీఎస్ సీఐ సీతారామిరెడ్డి, ఆర్‌ఐలు ఆనంద్, శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.


కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలకోసం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ప్రభుత్వ కార్యాలయాల్లో
26 నుంచి ఈ-ఆఫీసు అమలు

కడప కలెక్టరేట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 26 వతేదీ నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఇన్ఫర్మేషన్ అధికారి డాక్టర్ విజయకుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల జడ్పీ అధికారులు, ఎంపీడీఓలు, టైపిస్టులు, సిబ్బందికి ఈ-ఆఫీసు నిర్వహణపై ఎన్ఐసీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇన్ఫర్మేషన్ అధికారి మాట్లాడుతూ ఇప్పటికే ఈ-ఆఫీసు సిస్టం ఆచరణలో ఉండగా, అన్ని శాఖల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఆచరణలో లేని శాఖలు అందుకు సంబంధించిన కనీస మౌలిక సదుపాయాలను వెంటనే సమకూర్చుకోవాలన్నారు.


మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ విజయకుమార్

జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌వోకు పదోన్నతి

కడప కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్జన్లకు శనివారం ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఇందులో భాగంగా జమ్మలమడుగులో డిప్యూటీ డీఎం హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.శాంతికళకు పదోన్నతి లభించింది. ఆమె కర్నూలుకు డీఎం హెచ్‌ఓగా పదోన్నతిపై వెళ్లనున్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో పనిచేస్తున్న డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ పద్మావతిని కడప సీఎస్ఆర్ ఎంఓ 300 పడకల సూపర్ స్పెషాలిటీకి, ఎస్వీ తిరుపతి మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్ జె.రామాంజనేయులును కడప క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి బదిలీ చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

అధికారుల ముసుగులో వైసీపీ అనుకూలురు

- ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలా నిర్ణయాలు
- అలాంటివారిపై తక్షణమే చర్యలు చర్యలు తీసుకోవాలి
- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు


మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

కడప మారుతీనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ఆర్టీసీలోని కొంతమంది అధికారుల ముసుగులో ఉన్న వైసీపీ అనుకూలురు వ్యవహరిస్తున్నారని, వీరు కావాలనే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కడప-అన్నమయ్య జిల్లాల విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కొంతమంది కింది స్థాయి ఆర్టీసీ అధికారులు అక్రమంగా చార్జిషీట్లు ఇస్తూ, డ్యామేజీ కాస్ట్‌లను రికవరీ చేయడంతో పాటు సస్పెండ్లు, రిమూవల్స్ చేస్తూ సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. అలాంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు కేసులతో ఆర్టీసీ ఉద్యోగులను ఎక్కడైనా ఏ అధికారైనా, సూపర్‌వైజర్లయినా పనిష్మెంట్స్ ఇవ్వాలని చూసినా ఉద్యమాలు చేయడానికి వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న అన్ని కేటగిరీల తాలూకు ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులను ఉద్యోగుల విజ్ఞప్తుల మేరకు రిక్రూట్‌మెంట్ రెగ్యులేషన్ నిబంధనల ప్రకారం చేయాలన్నారు. ముఖ్యంగా సంబంధిత ఎండీ ప్రభుత్వ పరిశీలనకు పంపిన ప్రతిపాదనల ఫైల్‌ను ప్రభుత్వం అనుమతించి 3 వేల మందికి వచ్చే నూతన సంవత్సర కానుకగా పదోన్నతులిచ్చేలా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, ప్రభుత్వ పెద్దలు చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఈహెచ్ఎస్ ద్వారా ఉద్యోగులకు కనీస వైద్యసేవలు అందడం లేదని, సర్వీసులో ఉన్న ఉద్యోగులకు రిటైర్ అవుతున్న వారికి విలీనానికి ముందున్న పద్ధతుల్లోనే మెడికల్ సౌకర్యం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ కడప జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కేకే కుమార్, రాజశేఖర్, జిల్లా కార్యదర్శి ఏ.రామమూర్తి, కడప నాన్ ఆపరేషన్ రీజియన్ కార్యదర్శి ఎస్.అంకిరెడ్డితో పాటు పలువురు జోనల్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆపన్నులకు
అన్నసమర్పణ

- పాడుబడిన గుడులు, బడుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి
- నిలువ నీడలేకున్నా.. సేవా కార్యక్రమాల్లో ముందుకు
- శ్రీసుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవా సమితి సభ్యుల సేవలు అసామాన్యం

6

నాడు జిల్లా కోట..
నేడు శిథిలాల బాట

- మంత్రి రాకతో సిద్దవటం కోటకు పూర్వవైభవం వచ్చేనా...!
- నేడు మంత్రి కందుల దుర్గేశ్ రాక

6


దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్న కోట గోడలు

నలుగురు వైద్యాధికారులకు పదోన్నతులు

6

ఆపన్నులకు అన్నసమర్పణ

- పాడుబడిన గుడులు, బడుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి
- నిలువ నీడలేకున్నా.. సేవా కార్యక్రమాల్లో ముందుకు
- శ్రీసుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవా సమితి సభ్యుల సేవలు అసామాన్యం

కడప కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంచితనం మానవత్వం వారి అభి మతం. పేదలన్నా, అనాధలన్నా, హాస్టల్ విద్యార్థులన్నా అక్కున చేర్చుకుంటారు. వారికి మంచి రుచికరమైన ఇంటి భోజనం అందించి కొసరి కొసరి వడ్డిస్తారు. అంతేకాదు జిల్లాలో మారుమూల గ్రామాల్లో, కొండలు గుట్టల్లో ప్రభుత్వ, ప్రజల ఆదరణకు నోచుకోలేని పురాతన దేవాలయాలను శుభ్రం చేస్తారు. ఆధ్యాత్మిక సేవల్లో తమవంతు సాయం అందించి, ఆపన్నులకు అన్నసమర్పణా చేస్తూ మానవతను చాటుతున్న అసామన్యులు శ్రీ సుమఖీ అన్నపూర్ణేశ్వరీ సేవా సమితి సభ్యులు. వీరంతా కడప కేంద్రంగా సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. కానీ వీరంతా జిల్లాలో పలు గ్రామాలకు చెందిన మనసున్న మంచి మనుషులు.



రుచికరమైన వంటకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



గుడిని శుభ్రం చేస్తున్న కమిటీ సభ్యురాలు

మూడేళ్ల కిందట ఐదుగురు సభ్యులతో..

అది కరోనా సమయం. మనుషుల్లో మానవత్వం మాయం అవుతున్న రోజులవి. ప్రపంచమంతా ఈ వైరస్‌కు భయపడి ఇంటిగడప దాటి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి. ఒకపక్క కాలు కదపకుండా ప్రభుత్వం ఆంక్షలు.. మరోపక్క పనులు లేక ఎందరో పేదలు ఆకలితో అల్లాడారు. ఇలాంటి సంఘటనలు కళ్లారా చూసిన కడప శంకరాపురానికి చెందిన రామ్మూర్తి, పరమేశ్వరరెడ్డి, సుబ్రమణ్యం, దస్తగిరిరెడ్డిలను కలచి వేసింది. అనుకున్నదే తడవుగా తమ వంతుగా పేదలకు ఏదో ఒక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకుందామని టీ తాగుతూ ఆ నలుగురు కూడబలుక్కున్నారు. తమకు తెలిసిన స్నేహితులు, బంధువుల వద్ద కరోనా విలయం, మనిషి జీవితంపై పడిన ప్రభావం గూర్చి వివరించడంతో పాటు ఏదో ఒకటి చేద్దామని సహకారం కోరగా వారు పట్టించుకోలేదు. మానవసేవే మాధవ సేవ అని బలంగా నమ్మిన వీరికి మైదుకూరుకు చెందిన లక్ష్మీదేవి నేను సైతం అంటూ తోడయ్యారు. ఇలా మూడేళ్ల కిందట ఐదుగురు సభ్యులతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తమ దగ్గర ఉన్నంతలోనే పేదలకు, అనాధలకు అన్నసమర్పణ చేయడమే లక్ష్యంగా ముందుకు అడుగులు వేశారు.



పేదలకు వితరణ కోసం సిద్ధంగా ఉన్న దుప్పట్లు



గుడి-బడి శుభ్రతకు సిద్ధంగా ఉన్న కమిటీ సభ్యులు

వీరంతా సంపన్నులు, ఇన్‌కంటాక్స్ పేయర్స్ కానేకాదు. చిన్నపాటి వ్యాపారులు, ప్రైవేట్ కంపెనీలో 10-15 వేల నెల జీతగాళ్లే. ఇందులోనే ఇంటి ఖర్చులు పోను తాము చేసే కార్యక్రమానికి తలాకొంత వేసుకుంటూ అనుకున్న కార్యం గట్టెక్కించేలా ముందుకు సాగారు. తమ హీరో, నాయకుల పుట్టిన రోజుల నాడు పేదలకు, ఆసుపత్రుల్లో రోగులకు అరటి పండు, ఒక బ్రెడ్డు ముక్క ఇస్తేనే ఫొటోలకు ఫోజులిచ్చి పబ్లిసిటీ కోసం పాకులాడే రోజులివి. కానీ వీరి సేవలను పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వీరికి తెలీదు. కేవలం వాట్సాప్ గ్రూపులో తమ కార్యక్రమాలను మిత్రులకు, శ్రేయోభిలాషులకు పంపి తృప్తి చెందుతారు. వీరి సేవల్లో నిజాయితీ ఉండటంతో మేము సైతం అంటూ జిల్లా నలు మూలల నుంచి శ్రీ సుమఖీ అన్నపూర్ణేశ్వరీ సమితిలో సభ్యులుగా చేరుతున్నారు. ఇందులో ఇప్పుడు దాదాపు 300 మంది ఉన్నారు. వీరంతా కుటుంబంలా మారి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

కలసి పనిచేసేందుకు కార్యాలయమే లేదు

జిల్లాలో మూడేళ్ల కాలంలో అనాధలకు, హాస్టళ్లల్లో ఉన్న పేద విద్యార్థులకు చాలాసార్లు మృష్టాన్నభోజన సమర్పణ చేశారు. బెడ్‌షీట్లు, పండ్లు, వేసవిలో చల్లని మజ్జిగ పంపిణీ లాంటి దాదాపు 200కు పైగా కార్యక్రమాలు చేశారు. అందులో ఒక్కొక్క కార్యక్రమానికి రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అయినా సరే ప్రతి నెలా క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఒక కార్యక్రమం చేసే ముందు వాట్సాప్ గ్రూపులో సభ్యులకు తెలియజేస్తారు. అంతే మానవతావాదులంతా తలో చేయి వే స్తారు. అంతివ్వాలి.. ఇంతివ్వాలనే నిబంధన లేకుండా ఎవరికి తోచిన మేరకు సాయం అందించి ఆ కార్యాన్ని గట్టెక్కిస్తున్నారు.

ఇంతటి సేవా కార్యక్రమాలు చేస్తున్న వీరు కూర్చుని మాట్లాడుకునేందుకు జిల్లా కేంద్రంలో ఎలాంటి కార్యాలయం లేదు. వీరంతా కడపలోని పార్కుల్లో, టీకొట్ల వద్దనో కూర్చొని తాము చేయాల్సిన కార్యకలాపాలను గూర్చి చర్చించుకుంటారు. ఇటీవలనే నూతనంగా శ్రీ సుమఖీ అన్న పూర్ణేశ్వరీ సేవా సమితిని రిజిస్టర్ చేసుకున్నారు. తమ సమితికి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం సొంత స్థలం ఇస్తే కార్యాలయం ఏర్పాటు చేసుకుని సేవలను మరింత విస్తరిస్తామని వీరు అంటున్నారు.

విద్య, ఆధ్యాత్మిక సేవలు విస్తరిస్తాం

పేదలకు, అనాధలకు, హాస్టల్ విద్యార్థులకు ఇంటి భోజనంలా అన్నసమర్పణ చేస్తున్నాం. ఇప్పటికే వృద్ధాశ్రమాలు, రిమ్స్ ఆసుపత్రికి వచ్చేవారికి, కార్తీక మాసంలో దేవాలయాల వద్ద అన్నసమర్పణ చేస్తున్నాం. పేదల విద్యకు అధిక ప్రాధాన్యతతో పాటు యువతను సన్మార్గంలో పెట్టేందుకు ఆధ్యాత్మికత వైపు నడిపించే ఆలోచనలో ఉన్నాం. విద్యను ప్రోత్సహించేలా సేవలను విస్తరించే ప్రయత్నం చేస్తున్నాం.

- పరమేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు

స్థలం కేటాయిస్తే మరిన్ని సేవలు

పేదలకు, అనాధలకు స్వంత ఖర్చులతో సభ్యుల సహకారంతో అన్న సమర్పణ లాంటివి చేస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనే సంకల్పంతో ఉన్నాం. ఐదుగురితో ప్రారంభమైన మా సేవలు, ఈ రోజు జిల్లాలో 300 మందికి చేరుకుంది. మేము సేవలను విస్తరించేందుకు, కలసి చర్చించుకునేందుకు కార్యాలయం లేదు. ప్రభుత్వం కొంత స్థలం కేటాయిస్తే మాసేవలను మరింత విస్తరిస్తాం.

- రామమూర్తి, గౌరవాధ్యక్షుడు

గుడులు బడుల శుభ్రత పుణ్యకార్యం

పేదలకు భోజన సమర్పణ ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఆదరణకు నోచుకోని గుడులు బడులు పరిశుభ్రం చేయడం పుణ్య కార్యక్రమం. ఇలాంటి కార్యక్రమాలకు నాతో పాటు పిలిచిన వెంటనే 50 మందికి పైగా సభ్యులు రావడం, అందరు కలసి సేవా కార్యక్రమంలో పాలు పంచుకోవడం పూర్వజన్మ సుకృతం. శిథిలావస్థలో ఉన్న గుడుల శుభ్రత విషయంలో మమ్మల్ని సంప్రదిస్తే స్వంతఖర్చులతో వచ్చి శుభ్ర పరుస్తున్నాం.

- మైదుకూరు లక్ష్మీదేవి, సంఘ ఉపాధ్యక్షురాలు

మండల స్థాయిలో సేవలు జరిగేలా కమిటీలు

మా సంస్థ ద్వారా పేదలకు చేతనైన సహాయం చేస్తున్నాం. గతంలో సేవలు సాగించాలంటే చాలా ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారు, చిన్న, పెద్ద వ్యాపారులు, సామాన్య కూలీలు, ప్రైవేట్ సంస్థ ఉద్యోగులు సహకారం అందిస్తున్నారు. సేవా కార్యక్రమాలు మండల, నియోజకవర్గ స్థాయిలో విస్తరించేలా కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం.

- సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి

రేణిగుంట విమానాశ్రయానికి

అంతర్జాతీయ హోదా కల్పించాలి

- కేంద్ర మంత్రులకు బీజేపీ ఇన్‌చార్జి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడును కోడూరు బీజేపీ ఇన్‌చార్జి గడ్డం చంగల్రాజు ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. శనివారం ఫోన్ ద్వారా మాట్లాడుతూ రైల్వేకోడూరు, రాయచోటి, కడప, బద్వేలు తదితర ప్రాంతాల నుంచి కువైత్, ఖతార్, సౌదీ, బెహరిన్, దుబాయ్ తదితర దేశాలకు పొట్టకూటి కోసం వేలాది మంది వెళుతుంటారని కేంద్ర మంత్రులకు విన్నవించామని తెలిపారు. విమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రైల్వేకోడూరులో పలు రైళ్లు ఆగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలపగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. రైల్వే సహాయ మంత్రి వి.సోమన్నకు కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి సమస్యలపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించామని తెలిపారు. కేంద్ర మంత్రులందరు సానుకూలంగా స్పందించారన్నారు. రేణిగుంట నుంచి కనెక్టింగ్ విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం అవుతుందన్నారు. రేణిగుంట నుంచి బెంగుళూరు, లేదా రేణిగుంట నుంచి హైద్రాబాద్ వెళ్లి అక్కడి నుంచి కువైట్‌కు వెళ్లేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

రెడ్డివారిపల్లె-కోడూరు మధ్య రాకపోకలు



రెడ్డివారిపల్లె-రైల్వేకోడూరు మధ్య తాత్కాలిక రోడ్డును సిద్ధం చేసిన దృశ్యం

- తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత 20 రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు బంద్ అయ్యాయి. ఈ విషయంపై గత గురువారం ఆంధ్రజ్యోతిలో మూడు గ్రామాలకు రాకపోకలు బంద్ అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో శనివారం రెడ్డివారిపల్లె-రైల్వేకోడూరు మార్గంలో నిర్మించిన తాత్కాలిక రోడ్డుకు రోడ్లు భవనాల శాఖ డీఈ జయప్రసాద్ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ పాములపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో తాత్కాలిక రోడ్డు కు మరమ్మతులు చేశారు. ప్రజల రాకపోకలు ప్రారంభమయ్యాయి. గుర్రపాళెం-రైల్వేకోడూరు, తూర్పుపల్లె-పాట్టావాండ్లపల్లె మధ్య రాకపోకలు బంద్ అయిన విషయం తెలిసిందే. వాటికి కూడా తాత్కాలిక రోడ్లు ఏర్పాటు చేస్తామని రోడ్లు, భవనాల శాఖ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సంఘటనాస్థలంలో ప్రకాశ్ మృతదేహం

కురబలకోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగళ్లు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన యువకుడు ప్రకాశ్ (21) మండలంలోని అంగళ్లులో సెలూన్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇతను పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పరీక్షా పే చర్చ'ను విజయవంతం చేద్దాం

రాయచోటిటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చా-2025 కార్యక్రమం విజయవంతానికి జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఆర్ఎస్ అజయ్‌కుమార్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఈ పరీక్షా పే చర్చా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. విద్యాపరమైన సవాళ్లకు వినూత్న పరిష్కారాలను చర్చించడానికి దేశవ్యాప్తంగా పాల్గొనే వారిని ఎంపిక చేసి, వారిని ఈవెంట్‌లో ప్రశ్నలు అడగడానికి, ప్రధాన మంత్రితో నేరుగా ఇంటరాక్ట్ అయ్యే అవకాశం కల్పిస్తుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఆహ్వానం పలుకుతు న్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2025 జనవరి 14వ తేదీ వరకు ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎంపికైన వారికి ఈ మెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం తెలియజేస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం రాయచోటి డైట్ అధ్యాపకుడు ఎం.నాగరాజు (9000910805), అసదుల్లా (9440084715)లకు ఫోన్ చేసి సందేహాలుంటే తెలియజేయాలని తెలిపారు.

నాడు జిల్లా కోట.. నేడు శిథిలాల బాట

- మంత్రి రాకతో సిద్దవటం కోటకు పూర్వవైభవం వచ్చేనా...!
- నేడు మంత్రి కందుల దుర్గేశ్ రాక



పిచ్చిమొక్కలతో నిండిపోయిన కోట చుట్టూ ఉన్న కందకం



దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్న కోట గోడలు

సిద్దవటం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒకనాటి జిల్లా కేంద్రమైన సిద్దవటం అంటే టక్కున గుర్తు వచ్చేది కోటే. అలనాటి సిద్దవటం కోట సంస్కృతీ, సంప్రదాయాలను, శిలాసంపదను నాటి ఔన్నత్యాన్ని అలనాటి రాచరికపు వ్యవస్థను ప్రతిబింబిస్తోంది. ఆనాడు దేశంలోనే ఎంతో గుర్తింపు పొందిన ఈ కోట సొగసులు నేడు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అయినా పట్టించుకునేవారు కరయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మృతి చెందిన కౌలు రైతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం మంజూరు చేయడానికి పవన్‌కళ్యాణ్ సిద్దవటం వచ్చారు. అప్పట్లో సిద్దవటం కోటను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆదివారం సిద్దవటం కోటను సందర్శించనున్నారు. శిథిలాలబాట పట్టిన సిద్దవటం కోటను పర్యాటకులకు అందుబాటులో ఉంచడంతో పాటు కోట చుట్టూ ఉన్న కందకంలో బోటింగ్ ఏర్పాటు చేసి, దెబ్బతిన్న ప్రహరీగోడను మరమ్మతులు చేయడానికి చర్యలు తీసుకుంటారని తెలిసింది. వీటితో పాటు రాత్రి 10 గంటలు దాటితే అటవీశాఖ చెక్‌పోస్టును వాహనాలు తిరగకుండా ఫారెస్ట్ గేటును మూయడంతో పలు మండలాల వాసులు ఇబ్బందులకు గురవుతున్నారని, లంకమల్ల అభయారణ్య అడవుల్లో వెలసిన నిత్య పూజేశ్వరస్వామి కోనకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. మాచుపల్లె ఖాదర్ బంగ్లా వంతెన నిర్మాణం అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కోటి రూపాయల వ్యయంతో శంకుస్థాపన చేసి నేటికి 37 ఏళ్లు అయినా అది కలగానే మిగిలిపోయింది. వీటన్నింటిపైన పర్యాటకశాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ చిన్నారిని

అభినందించిన కలెక్టర్



బాలుడిని అభినందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన రాజంపేట ముకుందర్‌గడ్డకు చెందిన వీఆర్‌వో షేక్ ముజీబ్, షేక్ మసూదాబేగం దంపతుల కుమారుడు షేక్ మహమ్మద్‌ముష్తాక్ సిద్దికిని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను చిన్నారి తల్లిదండ్రులు కలిశారు. చిన్నారిని మరింత ప్రోత్స హించాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకునేలా బాగా చదివించాలని కలెక్టర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



కంబాల ప్రసాద్ (ఫైల్)

రైల్వేకోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో పీజీ హాస్టల్‌లో చేరడానికి వెళ్లి ఓ యువకుడు శవమై వచ్చాడు. వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఉన్న పగడాలపల్లెలో కంబాల సుబ్బరాయుడు, లక్ష్మీదేవిల రెండో కుమారుడు కంబాల ప్రసాద్ (22) అనే యువకుడు గత నెలలో బెంగళూరులో ఎంబీఏ చేరడానికి వెళ్లి అడ్మిషన్ తీసుకుని వచ్చేశాడు. ఈనెల 7వ తేది మళ్లీ బెంగళూరుకు తన మోటారు సైకిల్‌లో వెళ్లి పీజీ హాస్టల్‌లో ఉండడానికి అన్ని మాట్లాడుకుని 9 తేది తెల్లవారుజామున తన స్నేహితుడు రెడ్డయ్యతో కలసి రైల్వేకోడూరుకు వస్తుండగా చిత్తూరు జిల్లా బంగారుపాళెం సమీపంలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రసాద్ తలకు తీవ్రమైన గాయమైంది.

తన స్నేహితుడు రెడ్డయ్యకు చేతికి గాయమై బయటపడ్డాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అతడిని వేలూరు సీఎంసీకి తరలించారు.

అక్కడ 5 రోజుల పాటు చికిత్స పొందాడు. అక్కడి నుంచి రేణిగుంట సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ 3 రోజుల పాటు చికిత్స పొంది శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో పగడాలపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నలుగురు వైద్యాధికారులకు పదోన్నతులు

కలికిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో పనిచేస్తున్న నలుగురు వైద్యాధికారులకు పదోన్నతులు కల్పించి నియమకాలు కల్పించారు. శనివారం ప్రభుత్వం ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు పొందిన డిప్యూటీ సివిల్ సర్జన్ల నుంచి సివిల్ సర్జన్‌లుగా పదోన్నతులు పొందిన వైద్యాధికారుల జాబితాను విడుదల చేసింది. ప్రస్తుతం డిప్యూటీ సివిల్ సర్జన్ స్థాయిలో పనిచేస్తున్న ఈ నలుగురికీ సివిల్ సర్జన్ హోదా కల్పించి వివిధ పోస్టుల్లో నియమించారు. వాయల్పాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. ఫైరోజా బేగంకు పదోన్నతి కల్పించి శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా నియమించారు. ప్రకాశం జిల్లా మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ కె. పద్మావతిని కడప 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సీఎస్ఆర్వోగా నియమించారు. తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో రీ ఓరియెంటేషన్ ఆఫ్ మెడికల ఎడ్యుకేషన్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ జె.రామాంజనేయులును కడప క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సీఎస్ఆర్ ఎంవో (సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్)గా నియమించారు.అదే విధంగా కడప జిల్లా జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ పి. శాంతికళను కర్నూలు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా నియమించారు. పదోన్నతులతో నియామకాలు పొందిన వారు 15 రోజుల్లోగా బాధ్యతల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు శనివారం పదోన్నతుల జాబితాలకు సంబంధించిన ఆదేశాలు జారీ చేశారు.

సమగ్ర శిక్ష అధికారుల నియామకం

కడప, అన్నమయ్య జిల్లాల సమగ్ర శిక్షకు ఇద్దరు అధికారులను అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లుగా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తున్న ఎ.నిత్యానందరాజును కడప సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నియమించారు.

చిత్తూరు జిల్లా పలమనేరు ఎస్వీసీఆర్ ప్రభుత్వ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.నాగరత్నంరెడ్డిని అన్నమయ్య జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించారు. ఇరువురూ ఏడాదిపాటు ఏపీడీలుగా కొనసాగుతారు.

ఈ-పరిపాలనను వందశాతం అమలు చేయాలి

కడప రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ శాఖలో ఈ-పరిపాలనను వందశాతం అమలు చేయాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈ-ఆఫీస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-ఆఫీస్ వినియోగంపై సంబంధిత అధికారులు అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. ఈ-పరిపాలన ద్వారా కార్యాలయ పరిపాలనను మరింత సులభతరం చేస్తామన్నారు. ప్రధానంగా ఎంపీడీవోలు, ఏవోలు, టైపిస్టులు ఈ-పరిపాలనపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లాలోని ఎంపీడీవోలు, పరిపాలనాధికారులు (ఏవోలు), టైపిస్టులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఎక్కడివక్కడే..

- రూ.454 కోట్ల జీవో ఇచ్చి పరిహారాన్ని గాలికొదిలేసిన వైసీపీ సర్కారు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- పరిహారం కోసం గండికోట నిర్వాసితుల ఎదురుచూపు
- నేడు మంత్రి నిమ్మల గండికోట ప్రాజెక్టు సందర్శన


గండికోట ప్రాజెక్టు

కొండాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పవచ్చు. గత ప్రభుత్వం సమస్యలు గాలికొదిలేయడంతో నిర్వాసితులు పరిహారం, మౌలిక సదుపాయాల కోసం కూటమి ప్రభుత్వం పైనే ఆశలు పెంచుకున్నారు. ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించనున్న నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని గండికోట నిర్వాసితులు మంత్రిని కోరుతున్నారు.

రూ.454 కోట్ల పరిహారానికి జీవో ఇచ్చి గాలికొదిలేసి..

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమైంది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 6.7.2023న గండికోట నిర్వాసితుల పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపు గ్రామాలకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ. 3,25,000 చొప్పున 9096 మంది నిర్వాసితులకు గాను రూ.295.62 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో ఉంది. అదే విధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.58.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటివిడత 14 ముంపు గ్రామాల్లో పూర్తి గా పరిహారం అందని నిర్వాసితులకు 46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు 454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో పేర్కొంది. ఈ జీవోకు సంబంధించి కనీసం ఒక్క రూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో పరిహారం కోసం నిర్వాసితులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి పరిహారం ఇవ్వలేదు

గత వైసీపీ ప్రభుత్వంలో ముంపువాసుల సమస్యలను లేవనెత్తడంతో నాపై కక్షగట్టింది. నాకు రావలసిన రూ.7 లక్షల పరిహారాన్ని, భూమికి రూ.2 లక్షలు పరిహారాన్ని ఇవ్వకుండా గత ఐదేళ్లు ఆపేశారు. కూటమి ప్రభుత్వం నాతో పాటు నిర్వాసితులకు వెంటనే పరిహారం ఇవ్వాలి.

- బుగ్గన చంద్రశేఖర్‌రెడ్డి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు, తాళ్లప్రొద్దుటూరు

మౌలిక సదుపాయాలు నిల్

గండికోట నిర్వాసితులకు మౌలిక సదుపాయాలను కల్పించడంలోనూ గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పునరావాస కాలనీల్లో పాఠశాలలు, దేవాలయాలు, రోడ్లు, డ్రైనీజీలు, శ్మశానవాటికలు ఇలా అన్ని వసతులు అసంపూర్తిగానే ఉన్నాయి. వెంటనే మంత్రి చొరవ తీసుకొని వాటిని పరిష్కరించాలని నిర్వాసితులు కోరుతున్నారు.




తాళ్లప్రొద్దుటూరు రేకులషెడ్డులో నడుపుతున్న ప్రైమరీస్కూల్, (ఇన్‌సెట్లో) పునరావాస కాలనీలో రోడ్ల దుస్థితి

గండికోట నిర్వాసితుల సమస్యల్లో ముఖ్యమైనవి కొన్ని

- నిర్వాసితులకు జీవోలో ఉన్న విధంగా రూ.454.6 కోట్లు పరిహారం ఇవ్వాలి.
- పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.
- దత్తాపురం, చౌటిపల్లె ముంపునకు గురి కాక ముందు ఉన్న పంచాయతీలు యదాతథంగా ఉంచాలి.
- పునరాసం కింద పరిహారంలో కోతవిధించిన రూ.1,85,000 చెల్లించాలి.
- పరిహారం గల్లంతైన నిర్వాసితులకు తిరిగి సర్వే చేసి పరిహారం ఇవ్వాలి.
- కొండాపురం పట్టణంలో ముంపునకు గురైన ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలి.
- కొండాపురం జడ్పీహైస్కూల్, అసంపూర్తిగా ఉన్న తాళ్లప్రొద్దుటూరు హైస్కూల్, ప్రైమరీ స్కూలు వెంటనే పూర్తి చేయాలి.
- మంత్రి లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితుల ఉపాధికి పరిశ్రమ స్థాపించాలి.
- గండికోట ప్రాజెక్టుకు పర్యాటక అభివృద్ధి చేయాలి. బోటింగ్ సౌకర్యం కల్పించాలి.
- సోమశిల ముంపువాసుల మాదిరి గండికోట నిర్వాసితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలి.

నేడు గండికోట ప్రాజెక్టును సందర్శించనున్న మంత్రి నిమ్మల

కొండాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం గండికోట ప్రాజెక్టును సందర్శించనున్నట్లు జలవనరులశాఖ ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు.మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలులో ఆయన ఉదయం 4.00 గంటలకు జమ్మలమడుగు చేరుకుంటారన్నారు. 4.30 గంటలకు జమ్మలమడుగు సమీపంలోని చారిత్మక గండికోట వద్ద నున్న హరితా రెస్టారెంటుకు చేరుకొని విశ్రాంతి తీసుకుంటారన్నారు. ఉదయం 8.30 గంటలకు అక్కడ నుండి బయలుదేరి రోడ్డు మార్గాన గండికోట ప్రాజెక్టుకు చేరుకుంటారన్నారు. గండికోట ప్రాజెక్టు, సొరంగం లను పరిశీలిస్తారన్నారు. అనంతరం అధికారులతో, మీడీయా ప్రతినిధులతో సమావేశం అవుతారన్నారు. అక్కడి నుండి మధ్యాహ్నం 2 గంటలకు కడపకు చేరుకొని మేడాఫంక్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని ఈఈ తెలిపారు.అదేవిధంగా మంత్రితో పాటు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డిలు పాల్గొంటారని మంత్రి పర్యటన విజయవంతం చేయాలని మండల కూటమి ఇన్‌ఛార్జ్ దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు.

ఊహించినట్లే జరిగింది..!

- హెచ్చెల్సీ ప్రాజెక్ట్ చైర్మన్‌గా జిల్లాకు చెందిన జోగిరెడ్డి ఏకగ్రీవం
- వైస్ చైర్మన్‌గా అనంతపురం జిల్లాకు చెందిన కేశవరెడ్డి


హెచ్చెల్సీ ప్రాజెక్ట్ చైర్మన్ జోగిరెడ్డి, వైస్ చైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్/ సింహాద్రిపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్లుగానే తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) కమిటీ ఎన్నికైంది. కడప జిల్లాకు చైర్మన్, అనంతపురం జిల్లాకు వైస్‌చైర్మన్ పదవులు దక్కాయి. రెండేళ్ల పాటు ఒకరు, మరో మూడేళ్ల పాటు మరొకరు పదవుల్లో కొనసాగేలా పరస్పర అంగీకారంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హెచ్చెల్సీ లోక్ డివిజన్ కార్యాలయంలో శనివారం హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతపురం జిల్లాలోని 5డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్‌లు హెచ్‌ఎల్ఎంసీ కొండాపురం కేశవరెడ్డి, మిడ్‌పెన్నార్ సౌత్‌కెనాల్ డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ) కొర్రపాటి శేఖర్, మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ డీసీ రాజారెడ్డి, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ డీసీ కుమెత ప్రమీలమ్మ, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్ డీసీ బొమ్మయ్యగారి మారయ్య హాజరయ్యారు. కర్నూలు జిల్లా ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ నగరడోన కిష్టప్ప హాజరయ్యారు. కడప జిల్లా నుంచి కసనూరు డీసీ మారెడ్డి జోగిరెడ్డి, సింహాద్రిపురం డీసీ ఎర్రంరెడ్డి సూర్యశేఖర్‌రెడ్డి, వేంపల్లి డీసీ అన్నారెడ్డి వెంకటలక్ష్మిరెడ్డి, పెద్దముడియం డీసీ మాధవరెడ్డి, రాజుపాలెం డీసీ భూటూరు వెంకటజయరామిరెడ్డి, పోట్లదుర్తి డీసీ ఎద్దుల వెంకట సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో కడప జిల్లా కసనూరు డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని(ఓసీ) చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా అనంతపురం జిల్లా హెచ్‌ఎల్ఎంసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కొండాపురం కేశవరెడ్డి (బీసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు మిగిలిన 10 డిస్ట్రిబ్యూటరీల చైర్మన్లు సభ్యులుగా కొనసాగుతారు. ఎన్నికైన కమిటీని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల ద్విసభ్యకమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్‌ను నూతన కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్న నరేష్‌కుమార్

ప్రొద్దుటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై అప్పులపాలై నరేష్ కుమార్ (42) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం అమృతనగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నరేష్‌కుమార్ అమృతనగర్‌లో నివాసం వుంటూ ఆటోనడుపుతూ జీవనం కొనసాగించేవాడు. నరేష్ మద్యానికి బానిసై అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడిని తట్టుకోలేక ఇంట్లో రేకుల పైపులకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. నరేష్‌కు భార్య, ఒక కుమారుడు వున్నారు. భార్య గౌరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి మృతి


వృద్ధురాలు చెంచమ్మ (ఫైల్‌ఫోటో)

బద్వేలుటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుగంగ రోడ్డుకు చెందిన చెంచమ్మ(88) అనే వృద్ధురాలు గత నాలుగురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి కనపడకుండా ఉండటంతో ఆమె ఆచూకీ కోసం కొడుకులు, బంధువులు వెతుకుతుండగా శనివారం నాగలచెరువులో మృతదేహమై తేలింది. చేపలు పట్టేందుకు వెళ్లిన కొంతమంది యువకులు.. మృతదేహాన్ని పందులు లాగుతుండటం చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని బంధువులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకొని బోరున విలపించారు. పోలీసులు చెంచమ్మగా గుర్తించి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.

బాధితులకు ఆర్థిక సాయం

కడప కలెక్టరేట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం నగరంలోని రవీంద్రనగర్‌లో గ్యాస్ సిలిం డర్ పేలి ప్రమాదం సంభవించింది. విషయం తెలుసు కున్న కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ శని వారం ఆ కుటుంబ సభ్యులను కలిసి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు డివిజన్ ఇన్‌చార్జి దినకర్ రెడ్డితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ నేత అలీఖాన్, కాంగ్రెస్ నేతలు, అమీద్, జహూర్, రంతుల్లా ఖాన్, శ్యామలమ్మ, సంధ్య, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

నేడు సన్నపురెడ్డికి కేతు పురస్కారం ప్రదానం

కడప కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యర్రముక్కపల్లిలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని కథ, నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి ప్రదానం చేయనున్నట్లు కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్య చౌదరి తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమానికి పలువురు సాహితీ ప్రముఖులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పూలరాజు డిమాండ్ చేశారు. శనివారం కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ ఇచ్చిన హామీ జీఓ 77 రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతిదీవెన రూ.1480కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పైబడినా ఇంతవరకు జీఓ నెంబర్ 77పై మాట్లాడడం లేదన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర, అరుణ్, నగర అధ్యక్ష కార్యదర్శులు అఖిరానందన్, తేజ, నగర నాయకులు అశోక్, శమంత్, నిఖిల్, రాజేష్, మస్తాన్, సల్మాన్, ఈశ్వర్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు పార్టీ అండగా ఉంటుంది

మదనపల్లె టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులకు పార్టీ అధిష్ఠానం ఎల్లవేళలా అందుబాటులో వుంటుందని మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మాలేపాడుకు చెందిన టీడీపీ నాయకులు రమేశ్, గణేష్‌లను దొమ్మలపాటి పరామర్శించారు. ఈ సందర్భంగా నల్లరాజు గారిపల్లెలో శుక్రవారం రాత్రి జగన్ ఫ్లెక్సీ బ్యానర్ల ఏర్పాటు విషయమై టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు హత్యాయత్నానికి ఒడిగట్టడాన్ని రమేశ్ ఖండించారు. ఈ విషయమై పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుందని, దాడి చేసిన వైసీపీ నాయకులపై కఠినంగా చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులను కోరామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జి మేకల రెడ్డిశేఖర్, ఎస్ఎల్‌వీ రఘు, సాయిచిత్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వాస్పత్రిలో టీడీపీ నాయకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి, టీడీపీ నాయకులు

ఉజ్వల భవిష్యత్తుకు వైవీయూ జ్ఞాన కేంద్రం

- వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి



సభావేదికపై హాజరైన ముఖ్యఅతిథులు

కడపఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కన్నవారి ఆకాంక్షలను నెరవేర్చి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకునేందుకు విద్యార్థులకు యోగివేమన విశ్వవిద్యాలయం చక్కటి జ్ఞాన కేంద్రం అని యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ విద్య కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని మీరు ప్రయోజకులై సమాజ అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఫ్యాకల్టీ, విలువైన పుస్తకనిధి కలిగిన లైబ్రరీ ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిజిస్టర్ ఆచార్య వి.పద్మ మాట్లాడుతూ దేశంలోని అత్యున్నత విశ్వవిద్యాలయంలో వైవీయూ ఒకటన్నారు. వైవీయూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అద్భుతమైన వేదికన్నారు. ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో లభించే వనరులు, సద్వినియోగం చేసుకొనే విధానం వివరించారు. గౌరవ అతిథులుగా రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ గురువు మందలిస్తున్నాడంటే మిమ్మల్ని ఉన్నతంగా మలుస్తున్నారని భావించాలన్నారు. అనంతరం చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురియానంద స్వామి, తైక్వాండో శిక్షణ నిపుణుడు ఎం.నాగూర్‌బాబు, వ్యాయామ క్రీడల శాస్త్ర సంచాలకుడు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ప్రసంగించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక విభాగ సంచాలకులు ఆచార్య విజయభారతి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ముగ్గురు దొంగలు అరెస్టు

- రూ.7 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది, పట్టుబడిన బంగారు ఆభరణాలు, నగదు

జమ్మలమడుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగారు నగలు చోరీ చేసిన కేసులో ముగ్గురు దొంగలను అరెస్టు చేసి, ఆభరణాలతో పాటు కారు స్వాధీనం చేసుకున్నట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం అర్బన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జమ్మలమడుగు పట్టణంలోని నేతాజీనగర్‌లో బి.చెన్నారెడ్డి ఇంటిలో మధ్యాహ్న సమయంలో ఇంటికి వేసిన తాళాలు పగులకొట్టి బీరువా పగులకొట్టి రూ.35 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు ఆయన తెలిపారు. అదే రోజు బాధితుల ఫిర్యాదు మేరకు కడప నుంచి వచ్చిన నిపుణులు ఫింగర్‌ప్రింట్ తీసుకోగా అందులో మెరుగుబాబు ఫింగర్‌ప్రింట్స్ దొరికాయన్నారు. గువ్వలచెరువు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రాబడిన సమాచారం మేరకు ఒక నంబరులేని కారులో వారు ప్రయాణిస్తూ దొరికారు. పై ముగ్గురిని అర్బన్ పోలీసుస్టేషన్‌కు తెచ్చి విచారణ చేయగా వారు మరికొన్ని కేసుల్లో ఉన్నట్లు తెలిసిందన్నారు. మెరుగు బాబు, రాబూరి అన్వేషి, పిల్లనారప్ప గారి కళావతి జమ్మలమడుగు మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీ గూడెం చెరువువాసులు. కాగా వారి వద్ద నుంచి 15 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.20 వేలు నగదు, మొత్తం రూ.7 లక్షలు విలువచేసే ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐ రామక్రిష్ణ, పోలీసులు దేవదాసు, రియాజ్, రామాంజనేయరెడ్డిలకు ఎస్పీ, డీఎస్పీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు లింగప్ప, గోపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

కడపక్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను శనివారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. పెండింగు కేసుల వివరాలపై ఆరా తీశారు. నగరంలో పోలీసు 30 యాక్టు అమలులో ఉందని, అనుమతులు లేకుండా సభలు నిర్వహించరాదన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రానున్న డిసెంబరు 31న రాత్రి ఎక్కడా అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. రాత్రి పూట మద్యం తాగి వాహనాలు ఇష్టానుసారంగా నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రామక్రిష్ణ, ఎస్ఐ అమర్‌నాథరెడ్డిలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కడప కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర రవీంద్రనగర్‌కు చెందిన వెన్నపూస భాస్కర్‌రెడ్డి అనే అనాథ శవానికి శనివారం కాశీవిశ్వనాథ సేవా సమితి ప్రతినిధులు మానవత్వంతో హిందూ సాంప్రదాయ ప్రకారం అంత్య క్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందినట్లు వెల్లడించారు. కాగా మృతి చెందిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించక పోవడంతో తమ సమితి ఆధ్వర్యంలో అంత్యక్రియలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డిలక్ష్మణ్, పురుషోత్తం, దామోదర్, విజయ్, రాఘవేంద్ర, తదితరులున్నారు.

కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేయాలి

ధర్నాలో పలు పార్టీల, ప్రజా సంఘాల నేతలు



అఖిల పక్ష నేతలు చేపట్టిన నిరసన ధర్నా

కడప సెవెన్ రోడ్స్/ మారుతీనగర్, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ పట్ల అవహేళనగా వాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని పలు పార్టీల, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సగిలి గుర్రప్ప ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీప అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. రాజ్యాంగంపై మంత్రిగా ప్రమాణం చేసి పార్లమెంట్‌లో అంబేడ్కర్ పేరును ఉచ్చరించడాన్ని జీర్ణించుకోలేకపోవడం దారుణమన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమీత్‌షాను మంత్రి పదవి నుంచి తప్పిస్తూ దేశద్రోహం కేసు నమోదు చేసి భారత ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు పరచాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సత్తార్, సీపీఐ నాయకులు వెంకటశివ, సీపీఎం మాజీ నేత నారాయణ, నాయకులు సిఆర్‌వి ప్రసాద్, దేవర శ్రీకృష్ణ, ఆంజనేయులు, విద్యార్థి సంఘాల నాయకులు జయవర్ధన్, సుబ్బరాయుడు, శంకర్, ప్రశాంత్, బీఎస్పీ నేతబాలచంద్ర, మహిళా నాయకురాలు బేబీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు బీ.సీ. గంగులు, మల్లికార్జున, సిపిఐ మహిళా నాయకురాలు భాగ్యమ్మ, తోపాటుగా పలువురు పాల్గొన్నారు

'కూటమి ప్రభుత్వం వైసీపీ బాటలోనే...'

వేంపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని టీడీపీ సహా అన్ని పార్టీలు విమర్శించాయి. నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం అదే పనిచేస్తోందని ఏపీసీసీ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధికారం కోల్పోయేనాటికి రాష్ట్రం అప్పు దాదాపు రూ.10లక్షల కోట్లు అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుంచి రూ. 6796కోట్లు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.6796కోట్లు, హడ్కో నుంచి రూ.11వేలకోట్లు, కేఎఫ్‌వై బ్యాంకు (జర్మనీ)నుంచి రూ.5వేలకోట్లు మొత్తం రూ. 29595కోట్లు అప్పు తీసుకోవాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమన్నారు. అప్పులు చేయడం తగ్గించుకుని చట్ట ప్రకారం కేంద్రం నుంచి గ్రాంట్ రూపంలో నిధులు తెప్పించాలని తులసిరెడ్డి చంద్రబాబు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ నేతలు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, సుబ్బరాయుడు, వెంకటేష్, బద్రి, రాజు, రవి, వినయ్, మాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీదే విజయం : ఎంపీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీ

పులివెందుల టౌన్. డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీ అఖండ విజయం సాధిస్తుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శనివారం ఉదయం మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన సందర్భంగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేడుకలో పులివెందుల వైసీపీ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి తో కలిసి ఆయన సామూహిక ప్రార్థన నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, మున్సిపల్ కార్మికులు, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి దుస్తుల పంపిణీ చేపట్టారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కక్ష సాధింపు పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో జమిలీ ఎన్నికలైనా, 2029 సాధారణ ఎన్నికలైనా సరే వైసీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

వేంపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో పేదలకు ఉచితంగా బట్టలు పంపిణీ చేశారు. వైసీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, సర్పంచు ఆర్.శ్రీను పారిశుధ్య కార్మికులు, పేదలకు బట్టలు అందించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంలో కోటిరెడ్డి డిగ్రీకళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్బలక్ష్మమ్మ



కడప కోటిరెడ్డి డిగ్రీకళాశాలలో ధ్యానం చేస్తున్న అధ్యాపకులు డాక్టర్ శచీదేవి, విద్యార్థులు - వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత ఏర్పడుతుందని, తద్వారా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్బలక్ష్మమ్మ సూచించారు. శనివారం కోటిరెడ్డి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ ధ్యానం ప్రాధాన్యతను గుర్తించి ఐక్యరాజ్యసమితి డిసెంబరు 21న ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు మొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని అందరం జరుపుకొంటున్నామన్నారు. అనంతరం యోగా టీచర్ హిమబిందు విద్యార్థులకు ధ్యానం ప్రాధాన్యత వాటి ఉపయోగాలను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులతో ధ్యానం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.శచీదేవి, డాక్టర్ గురుమోహన్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత సాధ్యం

కడప కల్చరల్, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి) రోజూ క్రమం తప్పకుండా విద్యార్థులు ధ్యానం చేయడం వలన వారిలో ఏకాగ్రత పెంపొందగలదని రాజయోగిని బ్రహ్మకుమారి ప్రదీప సూచించారు. ప్రపంచ మెడిటేషన్ దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్ర-కర్ణాటక సబ్ జోన్ అదనపు ఇన్‌చార్జ్ సీనియర్ రాజయోగిని బి.కె. గీత దీది ఆధ్వర్యంలో శనివారం స్థానిక మా అమ్మ ఒడి అనాథశరణాలయంలో బాల, బాలురకు ధ్యానం యొక్క ప్రాధాన్యతను వివరించారు.

వేంపల్లెలో....

వేంపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శ్రీచైతన్య హైస్కూల్, వేంపల్లె ప్రాంగణంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, ప్రజాపతి బ్రహ్మకుమారీలు విజయ, త్రివేణి, సౌమ్య తదితరులు ధ్యానం ఆవశ్యకత, జీవనంపై ధ్యానం చేసే ప్రభావం వంటి అంశాలను తెలిపి ధ్యాన పద్దతులను ప్రదర్శించి, విద్యార్థులను ఉపాధ్యాయులతో ఆచరించేలా చేయించారు.

ఇళ్లస్థలాలపై యాక్షన్ ప్లాన్ విడుదల చేయాలి



సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయాల వద్ద నిరసన

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అర్హులైన పేదలకు నగరంలో రెండుసెంట్ల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరుకుయాక్షన్‌ప్లాన్ విడుదల చేసి అమలు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ డిమాండ్ చేశారు. మరియాపురంలోని 40వ డివిజన్ సచివాలయం వద్ద నిరసన చేపట్టిన ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేదలకు సెంటు చొప్పున ఇళ్లస్థలాల పట్టాలు ఇస్తే ఆయా ఇళ్లస్థలాలు నివాసయోగ్యంకాని ప్రాంతాల్లో కేటాయించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు సావంత్ సుధాకర్, పగడపూల మల్లికార్జున, జీవయ్య, షాజహాన్, నీలావతి, వన, హుస్సేన్ బి, షకీరాబేగం, రజియా సుల్తాన్, జయంతి, అర్జీదారులు పాల్గొన్నారు.

'నేటి నుంచి నీటి సరఫరా యథాతథం'

పులివెందుల టౌన్. డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నక్కలపల్లి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద పైపులైను లీకేజీ పనులు పూర్తయ్యాయని, ఆదివారం యథావిధిగా పట్టణంలో నీటి సరఫరా చేస్తారని మున్సిపల్ కమిషనరు రాముడు తెలిపారు. పనులు పూర్తి చేసిన సిబ్బందిని అభినందించారు. నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాయకుడిగా వృషభాచలేశ్వరుడు

వేంపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా మొదటి శనివారం పంచలోహ కవచంలో ఆంజనేయస్వామి దర్శనమిచ్చారన్నారు. ఆలయ ఈఓ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి వారిని రంగనాయకుడిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు రోజూ ధనుర్మాస పూజలు చేశారు.

పేదలకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు

కడప నాగరాజుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శనివారం తిరుమల టింబర్ డిపో వ్యవస్థాపకులు కంచి వెంకటసుబ్బయ్య 8వ వర్ధంతి సందర్భంగా శ్రీసాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీచౌడమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసి, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంచి వెంకటసుబ్బయ్య కుమారులు తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపికృష్ణ, సూర్యడెవలపర్స్ (హైదరాబాద్) అధినేత కంచి సురేంద్రనాథ్ సూరి, ఎంవీ కృష్ణారెడ్డి, డి.సుబ్బరాయుడు, పొన్నాలు శివశంకర్, ప్రసాద్, వృద్ధాశ్రమ నిర్వాహకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

'అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ పరిధిలో అక్రమ అడ్మిషన్ నిర్వహిస్తున్న బీఎడ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం వైవీయూలో వీసీ కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించిన వారు మాట్లాడుతూ ఒకే భవనంలో పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ, పీజీ, బీఎడ్ కళాశాలలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అటువంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. కళాశాలల్లో వసతులు లేకపోయినా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

సాగుచేయని డీకేటీ భూములను రద్దుచేయాలి

లింగాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాగుచేయని డీకేటీ భూములను వెంటనే రద్దుచేయాలని లింగాల టీడీపీ నేతలు తహసీల్దార్ ఈశ్వరయ్యకు ఫిర్యాదు చేశారు. లింగాలలో శనివారం శ్రీశక్తి భవన్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదులో అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, డీకేటీ పట్టాలు పొంది ఎందరో భూమి సాగుచేయకుండా ఉంచారన్నారు. అనర్హులకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములిచ్చారని, సాగుచేయకుండా గుట్టకు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ పొందుతున్నారని, వీటిపై విచారణ చేసి చర్యలు చేపట్టాలని అర్జీలిచ్చారు. రైతుల నుంచి మొత్తం నాలుగు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.

క్రీడల్లో వేంపల్లె విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపారని కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. శనివారం కడపలోని శివసాట గ్రూప్ అండ్ వేదాస్ ఇన్‌స్టిట్యూషన్ నిర్వహించిన వేదాస్ ఉత్సవం 2024-25 డిస్ట్రిక్ట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో జూనియర్ బాలుర విభాగం ఖోఖోలో మొదటి బహుమతి, సీనియర్ విభాగం వాలీబాల్‌లో రెండో బహుమతిని సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, క్రీడా ఉపాధ్యాయులను అభినందించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సికెదిన్నె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శిక్షణను సద్వినియోగం చేసుకుని రైతులకు ఉపయోగపడేలా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి కడప, అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారులు నాగేశ్వరరావు, చంద్రానాయక్ తెలిపారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం ఊటుకూరులో శిక్షణ, సంరక్షణ నిర్వహించారు. శనగ, మినుము, ఉలువ, వరి, వేరుశనగ, బొప్పాయి, మామిడి, అరటిని ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఏడీలకు వివరించారు. కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయ కర్త అంకయ్యకుమార్, ఆత్మా పీడీ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు పీరా సాహెబ్, మాధురి, సునీల్‌కుమార్, మానస, భాగవత ప్రియ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

వైసీపీ నుంచి టీడీపీలోకి 20 కుటుంబాలు చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి టీడీపీ పట్ల చేరుతున్నామని కీర్తిపల్లె వాసులు విజయ్‌కుమార్‌రెడ్డి, రామాంజుల్‌రెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి వీఎన్‌పల్లె మండలం పాయసంపల్లె పంచాయతీ కీర్తిపల్లెకు చెందిన రామానుజన్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి మరో 20 కుటుంబాలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసిహారెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారు మాట్లాడుతూ వైసీపీ నేతలను నమ్ముకున్న కార్యకర్తలను పట్టించుకోవడం లేదని విలువలు లేనప్పుడు ఆ పార్టీలో ఉండలేమని నిర్ణయించుకుని టీడీపీలో చేరామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్నారని టీడీపీతోనే ప్రజలకు మేలు జరుగుతుందని భావించి పార్టీలో చేరామన్నారు. కమలాపురం నియోజకవర్గాన్ని పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సహకారంతో అభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతో టీడీపీలో చేరామన్నారు. కార్యకర్తలకు అండగా ఉండడం చూసి కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా ముందుండి నడిపిస్తున్న నేతలను పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన ఎంత దూరమైన వచ్చి పనిచేసే నాయకులున్నారనే నమ్మకంతోనే పార్టీలో చేరామన్నారు. ఎమ్మెల్యే పట్టుదల చూస్తుంటే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తారని నమ్మకం కలిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఎస్‌పల్లె మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, పాయసంపల్లె మాజీ సర్పంచు వెంకటరమణారెడ్డి, టీడీపీ నేనతలు ఖాదర్‌బాష, కంకర్ సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామమునిరెడ్డి, వీఎన్‌పల్లె మడల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

కడప నాగరాజుపేట, డిసెబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్ శనివారం ఘనంగా జరిగింది. రకరకాల వంటలు, మంచి రుచితో విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించారు. కడప ఎంఈఓ వంటలను పరిశీలించి రుచిచూశారు. కరస్పాండెంట్ సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ చదువుతో పాటు వంట పట్ల అవగాహన ఉండాలని, భావితరాలు బయట ఫుడ్‌కు అలవాటు పడకుండా ఇంటి తిండి తినడం ఆరోగ్యానికి మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లల్లో వంట పట్ల అవగాహన వస్తుందన్నారు.

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో ధ్యాన దినోత్సవం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనవర్సిటీలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య విశ్వనాథ్ కుమార్, రిజిస్ట్రార్ ఎస్.రాజేష్‌కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. వేడుకల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, పీడీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, పీఆర్వో శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా నిత్యానందరాజు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ ఎ.నిత్యానందరాజును నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు. డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా ఏపీసీగా నియమంచారు. అధికారక త్వరితగతిన విధుల్లో చేరాలని, చేరిన తేదీని ప్రభుత్వానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి సదస్సులు

సికెదిన్నె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారని తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన ఊటుకూరు సచివాలయంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి 43 అర్జీలను స్వీకరించారు. వీటన్నింటికీ పరిష్కారం చూపుతామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గుర్రాల లక్ష్మీదేవి భూమిని ఓ సీఐ బెదిరించి ఓ వైసీపీ నేత బినామీ పేరుతో సంతకాలు చేయించుకున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం సెంటు రూ.80 వేలకు కొని అనంతరం రూ.2.75 లక్షలకు అమ్ముకున్నట్లు మా భూమి మాకు ఇప్పించాలని అర్జీ అందించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్లపై దాడులు చేస్తే న్యాయపోరుకు సిద్ధం

దైవజనులు, పాస్టర్ల సంఘం రాష్ట్ర నేత రెవరెండ్ లాజర్

కడప కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దైవ సేవలో కాలం వెళ్లదీస్తున్న పాస్టర్లపైనే కాకుండా చర్చిలపై దాడులకు తెగబడితే న్యాయ పోరాటానికి సిద్ధమవుతామని దైవజనులు- పాస్టర్ల సంఘం రాష్ట్ర నేత రెవరెండ్ లాజర్ స్పష్టం చేశారు. నగర కృపా కాలనీ న్యూనేటివ్ కృపా మినిస్ట్రీస్ పాస్టర్ పి.మహేష్-సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో బుడగజంగం కాలనీలో కొన్ని సమస్యల కారణంగా మూతపడిన పాత మందిరంలో జరిగిన ప్రత్యేక సదస్సులో ఆయన మాట్లాడుతూ సేవలను ఆటంకపరిచే వారు త్వరితగతిన మార్పు చెందాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఆర్‌పీఎఫ్ స్టేట్ నేత రెవరెండ్ శేషంప్రసాద్, యూపీఏ అసోసియేషన్ అధ్యక్షుడు పి. శ్రీనివాసులు, మాట్లాడారు. బుడగజంగం కాలనీ పెద్దలు డి. శ్రీరాములు, డి. రాజు, పాస్టర్స్ కె. ఆనంద్, డీవీ ప్రసాద్, మోషే పాల్గొన్నారు.

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రచారం

పెండ్లిమర్రి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు జడ్పీ హైస్కూల్లో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రచారం శనివారం నిర్వహించారు. రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించగా పిల్లలకు పనిచేసే చోట లైంగిక వేధింపులు నిరోధక చట్టం, నిరంతర విద్య, బాల్య వివాహాలు, గృహం గృహహింస మొదలైన వాటికి అగాహన కల్పించారు. పిల్లలకు ప్రకృతి వ్యవసాయంపై వ్యాసరచన, ఎస్పే రైటింగ్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్‌కుమార్, మండల టీం లీడర్‌సందీప్, హెడ్మాస్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



విద్యార్థులతో కరస్పాండెంట్ హరికృష్ణ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడపలోని అక్కాయపల్లె వికాస్ హైస్కూల్లో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గణితం ప్రయోగశాలను స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గణిత శాస్త్రం పట్ల ఉన్న భయాన్ని అపోహలను తొలగించేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. గణిత శాస్త్రం గురించి పూర్తిగా అవగాహన చేసుకునేందుకు ఈ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. పాఠశాల హెచ్ఎం హమీద్, రాజు విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

'బాధ్యతగా చదువుచెప్పండి'

వేంపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాధ్యతగా విద్యార్థులకు చదువు చెప్పాలని డీఈఓ మీనాక్షి ఉపాధ్యాయులను ఆదేశించారు. జడ్పీ బాలికల హైస్కూల్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు సైన్స్ పాఠాలు చెప్పలేదని ఇటీవల రచ్చకెక్కిన విషయంలో ఉపాధ్యాయులు బాధ్యతారాహిత్యంగా ఫిర్యాదులు చేసుకుంటూ హైస్కూల్లో వివాదానికి తెరలేపారు. జీతాలు తీసుకుంటూ విద్యార్థులకు చదువు చెప్పకపోవడంపై డీఈఓ మండిపడ్డారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపర చర్యలు తీసుకుంటామని ఆమె ఉపాధ్యాయులను మందలించారు.

వేడుకగా సెమీ క్రిస్మస్ వేడుకలు



డీసీసీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న తులసిరెడ్డి, విజయజ్యోతి - ఆరోగ్యమాత చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కడప కలెక్టరేట్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో వేడుకగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి మాట్లాడుతూ ఏసుప్రభువు పాపుల రక్షణ కోసం ఈ లోకంలో జన్మించాడని, ప్రతి మనిషి శాంతి, ప్రేమ, దయతో జీవించాలని సందేశం ఇచ్చారన్నారు. పాస్టర్ మల్లెం విజయ భాస్కర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, బండికరయ్య, సలావుద్దీన్ క్రీస్తు బోధనలు, బైబిల్‌లోని పలు అంశాలను ప్రసంగించారు. అనంతరం కేక్ కట్ చేసి నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు ప్రకటించుకున్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, బిషప్స్, పాస్టర్లు, కాంగ్రెస్ నేత లు కదిరి ప్రసాద్ గౌడ్, మామిళ్లబాబు, చిన్న కుళ్లాయప్ప, శ్యామలమ్మ, గంగాధర్, సంజయ్ కాంత్, నాగరత్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మత సమైక్యత కోసం ఏకం కావాలి

కడప కల్చరల్, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి): మత సమైక్యత కోసం అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాల్సిన ఆవశ్యకత ఉందని పలు పార్టీల, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరారు. రానున్న క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు ఆధ్వర్యంలో శనివారం నగర రైల్వేస్టేషన్ సమీప ఆరోగ్యమాత చర్చిలో ముందస్తు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడకలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు, సంఘసేవలకులు సలావుద్దీన్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, టీడీపీ నేత జి. లక్ష్మీరెడ్డి, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, సీపీఎం మాజీ నేత నారాయణరెడ్డి, సీపీఐ నగర అధ్యక్షుడు వెంకటశివ, హేతువాదసంఘం నేత సీఆర్‌వీ ప్రసాద్ చర్చి డైరెక్టర్ ప్రసాదరావు, ఫాదర్ మహేష్ సమక్షంలో కేక్ కట్ చేసి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలు, టీడీపీ మైనార్టీ నేతలు జేవీ రమణ, అజ్మతుల్లా, చార్లెస్, దాదాస్ రవికుమార్, మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి, నాగరాణి, పాల్గొన్నారు.

'ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి'

జమ్మలమడుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని జ్యోతిరావుఫూలే గురుకుల పాఠశాల ఎదురుగా విద్యార్థి అదృశ్యంపై సీపీఐ కార్యదర్శి ప్రసాద్, విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం వారు మాట్లాడుతూ పాఠశాలలో 10వ తరగతి చదువుతూ వెంకట హిమవంతు విద్యార్థి అదృశ్యమయ్యాడని, మూడు రోజులుగా ప్రిన్సిపాల్ రామక్రిష్ణారెడ్డి పట్టించుకోకుండా తల్లిదండ్రులతో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు.

ఆయుర్వేద హాస్పిటల్ కూల్చే ఉద్దేశం మానుకోవాలి

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠంలోని దేవస్థానం ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌ను దేవస్థానం అధికారులు కూల్చే ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం హాస్పిటల్ ప్రాంతంలో పర్యటించారు. అనంతరం సీపీయం జిల్లా కార్యవర సభ్యుడు శివకుమార్ మాట్లాడుతూ కడపకు చెందిన మునగ సింగరయ్య కుటుంబ సభ్యులు 1965లో ఆయుర్వేద హాస్పిటల్ నిర్మించారన్నారు. ప్రస్తుతం ఈ హాస్పిటల్‌ను తొలగించాలనే యోచనలో ఉన్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతోందన్నారు. వెంటనే ఆ ఆలోచన ఉంటే అధికారులు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎండాల్సిందేనా.. తడవాల్సిందేనా..?

● బస్ షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు ● బస్సులు వచ్చేంతవరకు నిలబడే ప్రయాణికుల నిరీక్షణ ● మహిళ,వృద్ధ ప్రయాణికులకు తప్పని కష్టాలు

ప్రొద్దుటూరు అర్బన్ డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బస్ షెల్టర్ లేక ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. నేటి వేగవంతమైన జీవితంలో బస్సు ప్రయాణం చాలా మందికి అనివార్యమైంది. అయితే ప్రొద్దుటూరులో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయి. బస్ షెల్టర్లు ప్రయాణికులు వర్షం, ఎండ నుంచి రక్షణ కల్పించేవి. కానీ, ప్రొద్దుటూరు పట్టణంలోని ఆర్టీసీ బస్సులలో ప్రతి రోజు 40 నుంచి 42 వేల మంది ప్రజలు ప్రయాణి స్తున్నారు. ప్రయాణికుల సౌకర్యం కోసం బీవీఎస్‌హాల్, అన్వర్ హాల్, వాసవీ సర్కిల్ పలుచోట్ల బస్ స్టాపింగ్‌లను ఏర్పాటు చేశారు. కానీ అక్కడ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు కష్టాలు పడుతున్నారు. ఎండ,గాలి, వర్షం పడే సమయంలో ప్రయాణికులు తడవాల్సిన పరిస్థితి ఉంటుంది.

● పరిష్కారానికి మార్గం..: నగర మున్సిపాలిటీ, ఆర్టీసీ అధికారులు బస్ షెల్టర్లు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలి. ఆర్థిక సాయం లేదా విరాళాల ద్వారా బస్ షెల్టర్లు నిర్మించేందుకు ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కోసం ముందుకు రావాలని ప్రయాణికులు ఆకాంక్షిస్తున్నారు.



ఆరవేటి థియేటర్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తూ ఎండలో నిలబడిన ప్రయాణికులు



బస్సు కోసం ఎండలో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

● షెల్టర్ లేక ఇబ్బంది



బస్ షెల్టర్ లేకపోవడంతో ఎండలోనే రోడ్డు పైన నిలబడాల్సివస్తుంది. ఏ బస్సు ఎక్కడ నిలబడుతుందో తెలియక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చొరవ చూపించి సమస్యను పరిష్కారించాలి.

లక్ష్మీదేవి, ప్రయాణికురాలు

● షెల్టర్ త్వరగా నిర్మించండి



బస్ షెల్టర్ లేకపోవడంతో ముసలివాళ్ళు, ఆడవాళ్ళు ఎండలోనే నిలబడి ఇబ్బందులు పడుతున్నాం. త్వరగా బస్ షెల్టర్ నిర్మించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలి. బస్ షెల్టర్ వల్ల బస్సులు వచ్చేంతవరకు ప్రయాణికులు ఎండ, వానల నుంచి ఆశ్రయం పొందుతారు.

దిల్షాద్ బేగం, ప్రయాణికురాలు

● చర్చించి సమస్యను పరిష్కారిస్తాం



ప్రయాణికుల సౌకర్యం కోసం మున్సిపల్ అధికారులతో చర్చించి త్వరలోనే బస్ షెల్టర్లను నిర్మించడానికి కృషి చేస్తాం. వాసవీ సర్కిల్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణానికి ఒక దాత ముందుకు వచ్చారు. అధికారులతో చర్చించి నిర్మాణం పూర్తి చేస్తాం. దాతలు, స్వచ్ఛంద సంస్థలు బస్ షెల్టర్లు నిర్మించేందుకు వారి సహాయ సహకారాలు అందించాలి.

ఎ. మల్లికార్జునరెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్

ప్రొద్దుటూరు మండలాన్ని సమగ్రాభివృద్ధి చేస్తాం

● ఎస్.సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో



ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలాభివృద్ధికోసం నిధులు పుష్కలంగా మంజూరయ్యాయి. అన్ని శాఖల సిబ్బందికి చేతినిండా పని ఉంది. గ్రామ పనులు కొనసాగుతున్నాయి. పల్లెల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం జరుగుతోంది. పంచాయతీల్లో పారిశుధ్య లోపంపై విమర్శలున్నాయి. డంపింగ్ యార్డుల సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ముందుకు సాగుతున్నాం. మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధిబాటలో పయనించేలా చేస్తాం అంటున్న ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణరెడ్డితో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల మంజూరు ఎంత.

జవాబు: ప్రొద్దుటూరు మండలానికి రూ.4.32 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

ప్రశ్న: పల్లె పండుగ కార్యక్రమం పనుల టార్గెట్ ఏమిటి.

జవాబు: ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సంక్రాంతినాటికి పనులు పూర్తి చేసి గ్రామాలకు కొత్త సొగసులు తేనున్నాం.

ప్రశ్న: గ్రామాల్లో అలంకారప్రాయంగానున్న నీటి ఉపరితల జలాశయాల మాటేమిటి.

జవాబు: మండల పరిధిలో మొత్తం 36 మంచినీటి ట్యాంకుల నిర్మాణాలు ఉన్నాయి. వినియోగంలో లేని ట్యాంకులను ఉపయోగించేలా ఆదేశిస్తూ నిత్యం క్లోరినేషన్ 15 రోజులకొకసారి ట్యాంకుల శుభ్రం చేసే చర్యలు చేపట్టి మంచినీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చేస్తాం.

ప్రశ్న: చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఎప్పుడు వినియోగంలోకి వస్తాయి.

జవాబు: పంచాయతీల అదనపు ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడే ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు జరుగుతున్నాయి.

ప్రశ్న: గ్రామ సచివాలయాల పనితీరు ఎలా ఉంది.

జవాబు: 15వ ఆర్థిక సంఘ నిధులు సకాలంలో జమ కావడంతో పారిశుద్యం, మంచినీరు, ప్రహరీ నిర్మాణాలు, రోడ్ల మరమ్మతుల పనులు ఇలా అన్ని శాఖల అధికారుల సిబ్బందితో అభివృద్ధిపథంలో పనులు సాగుతున్నాయి. స్వర్ణ పంచాయతీకి సంబంధించి డాటా సేకరణ జరుగుతోంది.

ప్రశ్న: శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురయ్యాయి కదా.

జవాబు: అన్ని గ్రామాల్లో ఉన్న శ్మశాన వాటికల్లో ఆక్రమణలకు గురైన వాటిని, ప్రహరీగోడలు లేనివాటిని సౌకర్యాలు లేకుండా అసంపూర్తిగా ఉన్న వాటిని గుర్తించి నివేదికలు తయారు చేసి రెవెన్యూ అధికారులకు అందజేయనున్నాం.

ప్రశ్న: మేజర్ పంచాయతీల్లో కూడా డంపింగ్‌యార్డులు లేవు కదా.

జవాబు: మండల పరిధిలోని 14 పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై కొంత మేర అసంతృప్తి ఫలితాలు ఉన్నప్పటికీ మేనేజర్ పంచాయతీల్లో డంపింగ్‌యార్డుల కోసం స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నాం.

ప్రశ్న: మండలాభివృద్ధి అధికారిగా మీ లక్ష్యం ఏమిటి.

జవాబు: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఎమ్మెల్యే, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం.

రాచమల్లు, బంగారురెడ్డి అవినీతిలో అనకొండలు

● కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి



ప్రొద్దుటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అవినీతిలో అనకొండలు రాచమల్లు, బంగారు రెడ్డిలేనని కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఆయిల్ మిల్లులో కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ కొతపల్లెలో సర్పంచ్‌గా నేను అవినీతికి పాల్పడుతున్నానని మున్సిపల్ వైస్‌చైర్మెన్ బంగారు రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. కొళాయి కనెక్షన్‌కోసం పదిలక్షలు డిమాండ్ చేశానని ఆరోపించటం హాస్యాస్పదం అన్నారు. కొత్తపల్లె పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి 5 కోట్ల పనులకు 24 లక్షల రూపాయల కమీషన్లు తీసుకున్నారన్నారు. నామీద కక్షతో పంచాయతీలో చేసిన పనులకు బిల్లులు రాకుండా నిలిపిన వ్యక్తి రాచమల్లు అన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానకోవాలని హితవు పలికారు. సమావేశంలో కౌన్సిలర్లు మునీర్,మహ్మద్ గౌస్, మురళీధర్ రెడ్డి టీడీపీ నాయకులు పొట్టు లక్ష్మీరెడ్డి, మాజీ కౌన్సిలర్ జంబబాపురం రామాంజనేయరెడ్డి, మాజీ జడ్పీటీసీ వెల్లాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్‌లో సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్థానిక కందిమల్లయ్యపల్లె జిల్లా పరిషత్ బాలుర హైస్కూలు విద్యార్థులు శనివారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మండల విద్యుత్ ఉపకేంద్రం, సబ్ స్టేషన్లను విద్యార్థులతో కలిసి సందర్శించారు. 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య విస్తరణాధికారి ఈవోపీఆర్‌డి కుమార రంగయ్య, ఏవో మల్లికార్జునరావు , పాఠశాల సిబ్బంది సోమిరెడ్డిపల్లె సచివాలయం టౌన్ సెక్రటరీ ప్రభాకర్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగును సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ



జమ్మలమడుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు శనివారం ఉదయం మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపల్ సెక్రటరి కన్నబాబు సందర్శించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్దకు రాగానే కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ, కూటమి నాయకులు గోనా పురుషోత్తంరెడ్డి, నవనీశ్వర రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉదయాన్నే గెస్ట్‌హౌస్‌లో వ్యర్థాలు తొలగించి ప్రత్యేక అలంకరణగా శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరి కన్నబాబు స్థానిక ఆర్డీవో సాయిశ్రీ, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డితో గెస్ట్‌హౌస్‌లో మాట్లాడారు. అక్కడినుంచి ఆర్డీవో, పట్టణంలోని టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన ఆదేశాల మేరకు సందర్శించి పరిశీలించినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు.మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనలోనే సంక్షేమాభివృద్ధి : ఎమ్మెల్సీ

జమ్మలమడుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ పాలనలోనే సంక్షేమం అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఉదయం జమ్మలమడుగు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వైసీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రుషికేశవరెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, దన్నవాడ మహేశ్వర్‌రెడ్డి, మహాలక్ష్మి, శివగురివిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇమామ్,మౌజన్ల వేతనాల కొనసాగింపు హర్షణీయం



మాట్లాడుతున్న జహంగీర్‌బాషా

బద్వేలురూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మసీదుల్లోని ఇమామ్,మౌజన్లకు అందజేస్తున్న వేతనాలను కొనసాగిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షణీయమని తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక సిద్దవటంరోడ్డులోని మసీదురూముల్లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇమామ్,మౌజన్లకు గౌరవవేతనాలను కొనసాగిస్తూ జీవో జారీచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిరిగిరిపల్లె ముస్తఫ, మహబూబ్‌బాష, సత్తార్, రసూల్, మహమ్మద్‌రఫీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



రాజుపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిఅన్నారు. శనివారం మండల పరిధిలోని వాసుదేవపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. భూసమస్యలపై వచ్చిన వినతిపత్రాలు ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, వీఆర్వో అశోక్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: కూటమి ప్రభుత్వంలోగ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న రైతుల భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని టీడీపీ యువనేత రితీశ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చల్లగిరిగెలలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రైతులు భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులను తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి అందించారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

దువ్వూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరులో అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన మల్లేశం కుటుంబానికి దాతలు రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం అయింది. దీనికి స్పందించిన ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లెకు చెందిన కట్టా గోపాలకృష్ణ రూ.10 వేలు, దువ్వూరుకు చెందిన పి.వెంకటసుబ్బయ్య, అబ్దుల్ హజీజ్ రూ.5 వేలు మృతుని భార్య సుమలతకు అందజేశారు. వీరు మృతుని నలుగురు కూతుర్లతోపాటు తల్లిని ఓదార్చారు.

ఎల్ఎస్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక



ఎల్ఎస్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్, ఉపచైర్మన్‌కు నియామక పత్రం అందిస్తున్న ఇరిగేషన్ ఈఈ వెంకట్రామయ్య

బి.కోడూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోయర్ సగిలేరు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు శనివారం ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య నిర్వహించారు. ఇందులో బద్వేలు మండలం చెముడూరు గ్రామానికి చెందిన ఈగ వెంకట రమణారెడ్డి ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా, ఉప చైర్మన్‌గా బి.కోడూరు మండలం గుంతపల్లె గ్రామానికి చెందిన తిప్పలూరు రామ్మోహన్‌రెడ్డిని ఇరిగేషన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు.

లోయర్ సగిలేరు ప్రాజెక్టు కమిటీకి బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాల్వల నీటి పారుదల డిస్ట్రిబ్యూట్ కెనాల్ చైర్మన్లు కలిసి ఈ ఎన్నికల్లో పాల్గొని ఎన్నుకున్నారు. కాబట్టి ఈ కార్యక్రమంలో బద్వేలు ఇన్ ఛార్జ్ రితీష్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ నవీన్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమర్‌జవాన్ స్థూపం ఏర్పాటు చేయాలి


ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వీరమరణం పొందిన సైనికుల త్యాగాలను స్మరించుకోవడానికి పట్టణంలోని నాలుగు రోడ్ల సెంటర్‌లో అమరజవాన్ స్థూపం ఏర్పాటు చేయాలని మాజీ సైనికులు శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిఫెన్స్‌కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అమరజవాన్ స్థూపం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మాజీ సైనికులు, పారామిలటరీ సైనికులకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి, కార్యదర్శి గురప్ప, కోశాధికారి శశాంక్‌రెడ్డి, నారాయణస్వామి, నరేంద్రనాథ్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని డీఎస్పీ భక్తవత్సలం పేర్కొన్నారు. శనివారం మూడు రోజులపాటు జరిగిన పాలిటెక్నిక్ అంతర్ కళాశాలల బాలుర క్రీడా పోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లు, క్రీడాకారులకు డీఎస్పీ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం డీఎస్పీ భక్తవత్సలం మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు, ఈఈఈ హెచ్‌వోడీ మంజునాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్తు కాంతులతో చర్చిలు ముస్తాబు



ముస్తాబైన టౌన్ చర్చి

జమ్మలమడుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శనివారం పలుప్రాంతాల్లో చర్చిలను ప్రత్యేక అలంకరణగా ముస్తాబు చేశారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిల కమిటీల వారు ఆయా ప్రాంతాల్లోని చర్చిలకు విద్యుత్తు దీపాలతో అలంకరించారు. పట్టణంలోని టౌన్ చర్చి, ఎస్‌పీజీ క్వార్టర్స్‌లోని చర్చి, ప్రొద్దుటూరు రోడ్డులో ఆర్‌సీఎం చర్చి, క్యాంబెల్ వైద్యశాలలో మోరగుడి, దేవగుడి, పెద్దదండ్లూరు తదితర గ్రామాల్లో చర్చిలు ముస్తాబు అయ్యాయి.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, డిసెం బరు 1 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెవారిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ రాబోవు గురువారంనాడు స్వామి జన్మనక్షత్రం స్వాతీనక్షత్రాన్ని పురష్కరించుకొని ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తున్నామని, పాల్గొన దలచిన భక్తులు వేకువజామున 5.30గంటలకే ఆలయానికి చేరుకోవాలని వారు తెలిపారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదకార్యక్రమాన్ని నిర్వహించారు.

రికార్డులు పరిశీలించిన డీఎస్పీ

పోరుమామిళ్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల పోలీసు స్టేషన్‌లోని రికార్డులను మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తనిఖీ చేశారు. శనివారం సాయంత్రం ఆయన పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి పాల్గొన్నారు.

నేడు సన్నపురెడ్డికి కేతు పురస్కారం ప్రదానం

కడప కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యర్రముక్కపల్లిలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని కథ, నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి ప్రదానం చేయనున్నట్లు కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్య చౌదరి తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమానికి పలువురు సాహితీ ప్రముఖులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పూలరాజు డిమాండ్ చేశారు. శనివారం కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారాలోకేశ్ ఇచ్చిన హామీ జీఓ 77 రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతిదీవెన రూ.1480కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పైబడినా ఇంతవరకు జీఓ నెంబర్ 77పై మాట్లాడడం లేదన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర, అరుణ్, నగర అధ్యక్ష కార్యదర్శులు అభిరానందన్, తేజ, నగర నాయకులు అశోక్, శమంత్, నిఖిల్, రాజేష్, మస్తాన్, సల్మాన్, ఈశ్వర్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం నిత్యం శ్రమించండి

● శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



వెంకటసుబ్బారెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

చెన్నూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన అలంఖాన్‌పల్లె నీటి సంఘం అధ్యక్షుడు తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి (బుజ్జన్న) శనివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఛైర్మన్‌ను అభినందిస్తూ మరింత బాధ్యతగా పనిచేస్తూ రైతుల అభ్యున్నతి కోసం నిత్యం శ్రమించాలన్నారు. ఏ రైతు కూడా నీరు రాలేదని, పంటలు ఎండిపోయాయన్న మాట వినబడకూడదని సూచించారు. ప్రతి రైతు మనకు అన్నం పెట్టే దేవుడన్న విషయం గుర్తుంచుకుని కష్టపడి పదవిని బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శివారెడ్డి, చిన్నమాచుపల్లె నీటి సంఘం అధ్యక్షుడు ఆవుల శంకర్‌రెడ్డి కలిశారు.

ఉజ్వల భవిష్యత్తుకు వైవీయూ జ్ఞాన కేంద్రం

● వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి



సభావేదికపై హాజరైన ముఖ్యఅతిథులు

కడపఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కన్నవారి ఆకాంక్షలను నెరవేర్చి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకునేందుకు విద్యార్థులకు యోగివేమన విశ్వవిద్యాలయం చక్కటి జ్ఞాన కేంద్రం అని యోగివేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ విద్య కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందని మీరు ప్రయోజకులై సమాజ అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఫ్యాకల్టీ, విలువైన పుస్తకనిధి కలిగిన లైబ్రరీ ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిజిస్టర్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ దేశంలోని అత్యున్నత విశ్వవిద్యాలయంలో వైవీయూ ఒకటన్నారు. వైవీయూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అద్భుతమైన వేదికన్నారు. ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో లభించే వనరులు, సద్వినియోగం చేసుకొనే విధానం వివరించారు. గౌరవ అతిథులుగా రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ గురువు మందలిస్తున్నాడంటే మిమ్మల్ని ఉన్నతంగా మలుస్తున్నారని భావించాలన్నారు. అనంతరం చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురియానంద స్వామి, తైక్వాండో శిక్షణ నిపుణుడు ఎం.నాగూర్‌బాబు, వ్యాయామ క్రీడల శాస్త్ర సంచాలకుడు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ప్రసంగించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక విభాగ సంచాలకులు ఆచార్య విజయభారతి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఊహించినట్లే జరిగింది..!

● హెచ్చెల్సీ ప్రాజెక్ట్ ఛైర్మన్‌గా జిల్లాకు చెందిన జోగిరెడ్డి ఏకగ్రీవం

● వైస్ ఛైర్మన్‌గా అనంతపురం జిల్లాకు చెందిన కేశవరెడ్డి



హెచ్చెల్సీ ప్రాజెక్ట్ ఛైర్మన్ జోగిరెడ్డి, వైస్ ఛైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్/ సింహాద్రి పురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఊహించినట్లుగానే తుంగ భద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలువ (టీబీపీ హెచ్చెల్సీ) కమిటీ ఎన్నికైంది. కడప జిల్లాకు ఛైర్మన్, అనంతపురం జిల్లాకు వైస్‌ఛైర్మన్ పదవులు దక్కాయి. రెండేళ్ల పాటు ఒకరు, మరో మూడేళ్ల పాటు మరొకరు పదవుల్లో కొనసాగేలా పరస్పర అంగీకారంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హెచ్చెల్సీ లోక్ డివిజన్ కార్యాల యంలో శనివారం హెచ్చెల్సీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అనంతపురం జిల్లాలోని 5డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్‌లు హెచ్ఎల్ఎంసీ కొండాపురం కేశవరెడ్డి, మిడ్‌పెన్నార్ సౌత్‌కెనాల్ డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ) కొర్రపాటి శేఖర్, మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ డీసీ రాజారెడ్డి, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ డీసీ కుమెత ప్రమీలమ్మ, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్ డీసీ బొమ్మయ్యగారి మారయ్య హాజర య్యారు. కర్నూలు జిల్లా ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ నగరడోన కిష్టప్ప హాజరయ్యారు. కడప జిల్లా నుంచి కసనూరు డీసీ మారెడ్డి జోగిరెడ్డి, సింహాద్రిపురం డీసీ ఎర్రంరెడ్డి సూర్యశేఖర్‌రెడ్డి, వేంపల్లి డీసీ అన్నారెడ్డి వెంకట లక్ష్మిరెడ్డి, పెద్దముడియం డీసీ మాధవరెడ్డి, రాజుపాలెం డీసీ భూటూరు వెంకట జయరామిరెడ్డి, పోట్ల దుర్తి డీసీ ఎద్దుల వెంకట సుధాకర్‌రెడ్డి హాజర య్యారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో కడప జిల్లా కసనూరు డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని(ఓసీ) ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా అనంతపురం జిల్లా హెచ్ఎల్ఎంసీ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ కొండాపురం కేశవరెడ్డి (బీసీ)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లతో పాటు మిగిలిన 10 డిస్ట్రిబ్యూటరీల ఛైర్మన్లు సభ్యులుగా కొనసాగుతారు. ఎన్నికైన కమిటీని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శింగనమల ద్విసభ్యకమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్‌ను నూతన కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

కడపక్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌ను శనివారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. పెండింగు కేసుల వివరాలపై ఆరా తీశారు. నగరంలో పోలీసు 30 యాక్టు అమలులో ఉందని, అనుమతులు లేకుండా సభలు నిర్వహించరాదన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రానున్న డిసెంబరు 31న రాత్రి ఎక్కడా అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. రాత్రి పూట మద్యం తాగి వాహనాలు ఇష్టానుసారంగా నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రామక్రిష్ణ, ఎస్ఐ అమర్‌నాథరెడ్డిలు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

కడప కలెక్టరేట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం నగరంలోని రవీంద్రనగర్‌లో గ్యాస్ సిలిం డర్ పేలి ప్రమాదం సంభవించింది. విషయం తెలుసు కున్న కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ శని వారం ఆ కుటుంబ సభ్యులను కలిసి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు డివిజన్ ఇన్‌చార్జి దినకర్ రెడ్డితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ నేత అలీఖాన్, కాంగ్రెస్ నేతలు, అమీద్, జహరార్, రంతుల్లా ఖాన్, శ్యామలమ్మ, సంధ్య, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కడప కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర రవీంద్రనగర్‌కు చెందిన వెన్నపూస భాస్కర్‌రెడ్డి అనే అనాథ శవానికి శనివారం కాశీవిశ్వనాథ సేవా సమితి ప్రతినిధులు మానవత్వంతో హిందూ సాంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందినట్లు వెల్లడించారు. కాగా మృతి చెందిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో తమ సమితి ఆధ్వర్యంలో అంత్యక్రియలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డిలక్ష్మణ్, పురుషోత్తం, దామోదర్, విజయ్, రాఘవేంద్ర, తదితరులున్నారు.